సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



'సముద్ర ప్రహరీ' విన్యాసాలు

'సముద్ర ప్రహరీ' నౌక థాయ్‌లాండ్‌లోని ఖ్‌లాంగ్ టోయ్ పోర్ట్‌లో టేబుల్–టాప్ ఎక్సర్‌సైజ్, ప్రదర్శన నిర్వహించింది. 8లో



గెడ్డల్లో పూడికలు తొలగించండి

ప్రధాన గెడ్డల్లో పూడికలు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 8లో



దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. 8లో

రుణ వాయిదా.. పేటీఎం కరో..!

సాక్షి, విశాఖపట్నం : బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు. గంటల కొద్దీ లైన్లలో నిల్చోవాల్సిన అగత్యం లేదు. స్త్రీ నిధి రుణ వాయిదాను ఎంచక్కా ఇంట్లో ఉంటూనే చెల్లించొచ్చు. ఈ మేరకు ప్రభుత్వం కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టింది. పేటీఎం ద్వారా రుణ వాయిదాలు చెల్లించేందుకు వెసులుబాటు కల్పిస్తోంది. ఇందుకోసం పేటీఎం మెషీన్స్‌ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్రక్రియను రెండ్రోజుల్లో ప్రారంభించేందుకు డీఆర్‌డీఏ డైరెక్టర్ శోభారాణి ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో జీవీఎంసీ పరిధిలోనూ ఈ విధానం అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానం వల్ల ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదు. సమయం ఆదా అవుతుంది.



- డిజిటల్ విధానంలో స్త్రీనిధి రుణాల చెల్లింపునకు శ్రీకారం
- ఒక్కో గ్రామైక్య సంఘానికి ఒక పేటీఎం మెషీన్
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని 4 మండలాల్లో అమలు
- రెండు రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు

జిల్లాలోని 4 మండలాల్లో 168 గ్రామైక్య సంఘాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 4,845 గ్రూపులున్నాయి. ఇందులో 631 ఎస్‌హెచ్‌జీల్లో ఉన్న 3,165 మంది సభ్యుల జీవనోపాధికి జిల్లాలో ఇప్పటివరకు రూ.26 కోట్ల వరకూ స్త్రీనిధి బ్యాంకు రుణాలు అందించింది. స్త్రీ నిధి నుంచి తీసుకున్న రుణాలను నిర్ణీత కాలవ్యవధిలో నెల నెలా వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. పాత విధానంలో నెల వాయిదాలను గ్రూపు సభ్యులు ఆ గ్రూప్ లీడర్ ద్వారా గ్రామైక్య సంఘానికి చెల్లించేవారు. ఈ గ్రామైక్య ఖాతా నుంచి గ్రామ సంఘం అధ్యక్షులు ద్వారా వీఓఏ స్త్రీ నిధికి ఖాతాకు జమ చేసేవారు. ఈ విధానంలో సమయం వృథా, అదనపు ఖర్చులు పెరిగేవి. దీంతో పాటు నిర్ణీత సమయంలో చెల్లించకపోతే సభ్యులపై వడ్డీ భారం పడేది. ఇటువంటి పరిస్థితికి ప్రభుత్వం చెక్ చెబుతూ డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ నూతన విధానంలో పూర్తి పారదర్శకత ఉంటుంది.

ప్రతి గ్రామైక్య సంఘానికి పరికరం

ప్రస్తుతానికి జిల్లాకు 2 పేటీఎం మెషీన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలోనే మరికొన్ని మెషీన్లు రాబోతున్నాయి. ప్రతి గ్రామైక్య సంఘానికి ఒక పేటీఎం మెషీన్ అందించనున్నారు. రెండు మూడు రోజుల్లో కలెక్టర్ డా.మల్లికార్జున ఈ విధానాన్ని ప్రారంభించనున్నారు. ఈ కొత్త విధానంలో స్త్రీ నిధి మహిళా బ్యాంకు ప్రతి గ్రామైక్య సంఘానికి పేటీఎం మెషీన్ అందించాలని నిర్ణయించింది. పేటీఎం మెషీన్ గ్రామైక్య సంఘం నియమించిన వీఓఏ లాగిన్‌లో నిర్వహిస్తుంది. రుణం తీసుకున్న సభ్యులు తమ సంఘం లీడర్‌కు రుణ వాయిదా మొత్తం చెల్లిస్తారు. వీఓఏ స్వయం సహాయక సంఘం సమావేశానికి హాజరై రుణాల రికవరీ వివరాలు పేటీఎం మెషీన్లో నమోదు చేసి లావాదేవీలు పూర్తి చేస్తారు. నగదుగా వసూలు చేసిన రుణ మొత్తాలను సంఘం లీడర్ తన వ్యక్తిగత బ్యాంక్ ఖాతా ఉపయోగించి యూపీఐ పేమెంట్ ద్వారా చెల్లించి.. రసీదు తీసుకుంటారు.

మండలం	గ్రామ సమైక్యలు	స్వయం సహాయక సంఘాలు	స్త్రీనిధి రుణ గ్రహీత గ్రూప్‌లు	రుణ సభ్యులు
ఆనందపురం	53	1558	182	1062
భీమునిపట్నం	37	1024	150	749
పద్మనాభం	45	1424	176	830
పెందుర్తి	33	839	123	524
మొత్తం	168	4845	631	3165

రుణాలు ఇలా చెల్లిస్తారు..

- పేటీఎంలో వీఓఏ మొబైల్ నంబరుతో లాగిన్ కావాలి
- ఏ వీఓఏకి సంబంధించిన రుణాలు కట్టాలని అనుకుంటున్నారో.. ఆ మొబైల్ నంబర్ నుంచి పిన్ జనరేట్ చేసుకొని లాగిన్ అవ్వాలి. పేమెంట్స్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్(ఎస్‌హెచ్‌జీ) ఐడీ నమోదు చేయాలి.
- నమోదు చేసిన వెంటనే ఆ సంఘంలో స్త్రీ నిధి రుణం తీసుకున్న సభ్యుల పేర్లు అందులో కనిపిస్తాయి.
- అందులో ఏ సభ్యురాలి నెలవారి వాయిదా(ఈఎంఐ) చెల్లించాలో ఆ సభ్యురాలి పేరుపై క్లిక్ చేయాలి.
- గ్రూప్ సభ్యురాలి డిమాండ్ మొత్తం, క్లోజర్ అవుట్‌స్టాండింగ్ చూపిస్తుంది. ఆ సభ్యురాలు ఎంత ఈఎంఐ చెల్లించాలో ఆ మొత్తాన్ని అక్కడ నమోదు చేయాలి.
- ఇలా ఎంత మంది సభ్యుల నగదు చెల్లించాలని అనుకుంటారో.. వారి రికవరీ మొత్తాల అక్కడే నమోదు చేసి.. రికవరీ చేయాలనుకున్న మొత్తం సమానంగా ఉన్నాయో లేదా చూసుకోవాలి.
- పేమెంట్ ఏవిధంగా చేయాలి అనేది ఎంపిక చేసుకోవాలి. రూపేకార్డు, స్కాన్ క్యూఆర్ కోడ్, యూపీఐ పేమెంట్ సెలెక్ట్ చేసుకునే సదుపాయం ఉంది.
- తర్వాత కంప్లీట్ ఆర్డర్‌పై క్లిక్ చేయాలి. అనంతరం ప్రింట్ తీసుకొని సభ్యురాలికి అందజేయాలి.

అవగాహన కల్పిస్తున్నారు



జిల్లాలో స్త్రీనిధి రుణాల చెల్లింపులకు సంబంధించి స్వయం సహాయక బృందాల్లోని మహిళలకు డీఆర్‌డీఏ, స్త్రీనిధి అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త విధానం వల్ల సమయం ఆదా అవుతుంది. చెల్లింపుల్లో కచ్చితత్వం ఉంటుంది. గడువులోపు చెల్లింపులు జరిపేందుకు వీలు కలుగుతుంది. ప్రతి ఒక్క ఎస్‌హెచ్‌జీ ఈ డిజిటల్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి. త్వరలోనే మెప్మా పరిధిలోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

– డా.మల్లికార్జున, కలెక్టర్

న్యూస్‌రీల్

న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా మహేశ్వర్‌రెడ్డి



మహేశ్వర్‌రెడ్డి



ఆనంద్‌ప్రసాద్

దొండపర్తి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జితో పాటు, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల న్యాయ విభాగ అధ్యక్షులను నియమించారు. న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా గొరుసు మహేశ్వర్‌రెడ్డి, విశాఖ జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడిగా మేడిది ఆనంద్‌ప్రసాద్ నియమితులయ్యారు. అలాగే అనకాపల్లి జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా అడారి వీర వెంకట సత్యనారాయణ(స్వామి), అల్లూరి సీతారామరాజు జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా పి.మురళీమోహన్ నియమితులయ్యారు.

ఏయూతో శ్రీలంక వర్సిటీ అధికారుల చర్చలు



మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులతో శ్రీలంకకు చెందిన శ్రీ జయవర్ధన విశ్వవిద్యాలయం అధికారులు సమావేశమయ్యారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య పి.డి.సత్యపాల్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. శ్రీలంకలోని శ్రీ జయవర్ధన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఎం.పద్మలాల్, పాలి–బుద్ధిస్ట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య ఎం.విజితానంద పాల్గొన్నారు. ఏయూలో పాలి–బుద్ధిస్ట్ స్టడీస్ అంశంలో ఎంఏ కోర్సును ప్రారంభించే దిశగా అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకోవడానికి సన్నాహకంగా ఈ సదస్సు నిర్వహించారు. రెండు విశ్వవిద్యాలయాల్లో వసతులు, కోర్సు నిర్వహణకు సాధ్యాసాధ్యాలను చర్చించారు. కార్యక్రమాన్ని డాక్టర్ నిమాలి తక్షిల సమన్వయం చేశారు.

24న న్యాయస్థానాల సముదాయం ప్రారంభం

విశాఖ లీగల్: నగరంలో నూతనంగా నిర్మించిన న్యాయస్థానాల సముదాయాన్ని ఈనెల 24న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రారంభిస్తారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కార్యక్రమం ఖరారు చేసింది. 23న సాయంత్రం ప్రధాన న్యాయమూర్తి నగరానికి చేరుకుంటారు. 24న ఉదయం 10.30 గంటలకు విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని నూతనంగా నిర్మించిన పది న్యాయస్థానాల సముదాయాన్ని ఆయన ప్రారంభిస్తారు. ప్రధాన న్యాయమూర్తి వెంట విశాఖ న్యాయస్థానాల పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ కూడా వస్తున్నారు.

'ఆరోగ్య సురక్ష' కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మహారాణిపేట: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30వ తేదీ నుంచి మెడికల్ క్యాంప్ నిర్వహణకు అవసరమైన సలహాలు, సూచనల కోసం కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూమ్‌లో ముగ్గురు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వైద్య శిబిరాలు, సాంకేతిక సలహాలు, సూచనల కోసం 9247423800, 8985181874, 9110394476 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై 29న వర్క్‌షాపు

మహారాణిపేట: వినియోగదారుల రక్షణ చట్టంపై ఈ నెల 29న విశాఖలో దక్షిణాది రాష్ట్రాల వర్క్‌షాపు జరగనుంది. వర్క్‌షాపులో కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు అండమాన్ నికోబార్‌కు చెందిన సంబంధిత అధికారులు, వినియోగదారుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొంటారు. నోవాటెల్ వేదికగా జరిగే వర్క్‌షాపు నిర్వహణ కోసం వివిధ ప్రభుత్వ శాఖలతో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సమన్వయ కమిటీని ఏర్పాటు చేశా రు. కేంద్ర కన్స్యూమర్ వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి, కేంద్ర స్పెషల్ సెక్రటరీ నిధి ఖరే, కేంద్ర సంయుక్త కార్యదర్శి అనుపమ్ మిశ్రా, జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఎ.ప్రతాప్ సాహి తదితరులు వర్క్‌షాపునకు హాజరుకానున్నారు.

త్వరలోనే తెలుగు భాషపై ప్రత్యేక వెబ్‌సైట్

- ఉత్తరాంధ్ర సాహిత్య సదస్సును పండగలా నిర్వహిద్దాం
- ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



విజయబాబుని సత్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచీకరణ, అభివృద్ధి చెందుతున్న తరుణంలో తెలుగు భాష గురించి ప్రపంచానికి చాటిచెప్పేందుకు త్వరలో తెలుగు భాషపై వెబ్‌సైట్ రూపొందిస్తున్నట్లు ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు అన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో తెలుగు భాషా అమలు తీరుపై కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమీక్షలో విజయబాబు మాట్లాడారు. జిల్లాలో భాషావేత్తలు, కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలు, తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేసిన వారందరికి సత్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల్లోనూ ఎంతో మంది కవులు, సాహితీవేత్తలున్నారనీ వారిని కూడా గౌరవించాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. త్వరలోనే ఉత్తరాంధ్ర సాహిత్య సదస్సును పండగలా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని సూచించారు. కార్యాలయంలో ఉన్నతాధికారులు ఆంగ్లంలో పంపిన లేఖలను తెలుగులో పంపాలని కోరుతూ తిప్పి పంపించవచ్చని స్పష్టం చేశారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ బ్రోచర్లను తెలుగులోనే ముద్రిస్తున్నామని, బస్ స్టాప్‌లో సమాచారం కూడా తెలుగులోనే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమీక్ష అనంతరం విజయబాబుని కలెక్టర్ సత్కరించారు. డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి కుమార్ పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో 'మధురవాడ హైట్స్'కు వేలం



మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ కమిషనర్, కలెక్టర్ మల్లికార్జున

దొండపర్తి: మధురవాడ హైట్స్ పేరుతో అభివృద్ధికి కేటాయించిన 14 ఖాళీ స్థలాలకు ఈ నెల 29, 30 తేదీల్లో ఈ–వేలం నిర్వహిస్తున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గురువారం వీఎంఆర్‌డీఏలో ఈ–వేలం కార్యక్రమానికి సంబంధించి క్రెడాయ్, నేరెడ్‌కో, ఛాంబర్ ఆఫ్ కామర్స్, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, వివిధ బ్యాంక్ ప్రతినిధులతో ప్రీ బిడ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురవాడలో ఎన్‌హెచ్–16కు అత్యంత చేరువలో, పూర్తిగా అభివృద్ధి చెందిన ప్రాంతంలో, గాయత్రి మెడికల్ కాలేజ్ పక్కన సర్వే నెంబర్ 421(పాత సర్వే నెంబర్–27)లో వీఎంఆర్‌డీఏకు చెందిన 87.80 ఎకరాల కొండ భూమి ప్రాంతం రానున్న రోజుల్లో అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారనుందని పేర్కొన్నారు. దీనిని 'మధురవాడ హైట్స్' పేరుతో 3 నుంచి 12 ఎకరాల పరిమాణంలో 14 భాగాలుగా విభజించి, అన్ని విభాగాలకు 80 అడుగుల రోడ్లు, ప్రధాన విద్యుత్ లైన్ సదుపాయాలు కల్పించి ఈ–వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాంతం మిక్స్‌డ్ యూజ్ జోన్–2గా మాస్టర్‌ప్లాన్‌లో నిర్దేశించడంతో నివాస, వాణిజ్య, విద్య సంబంధమైన అభివృద్ధిని చేపట్టవచ్చని చెప్పారు. 45 మీటర్లు ఎత్తు వరకు నిర్మాణాలు చేపట్టవచ్చన్నారు. వేలం ప్రారంభ ధర చదరపు గజానికి రూ.30 వేలు మాత్రమే నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మధురవాడ మార్కెట్ ధరలను పరిగణిస్తే ఇది అత్యంత అనువైన ధర అని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వేలంలో పాల్గొనాలనుకొనే వారు ఈ నెల 27వ తేదీలోగా "http://konugou.ap.gov.in"లో రిజిస్ట్రేషన్ చేసుకొని నిర్ణీత ఈఎండీ చెల్లించాలన్నారు. అలాగే సమావేశంలో పలువురు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేసి కొనుగోలుదారులకు సహకరించేందుకు వీఎంఆర్‌డీఏ సంసిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, కార్యదర్శి రంగయ్య, చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్‌రాజు, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్‌రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి రాక రేపు

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి ఈనెల 23న విశాఖ వస్తున్నారు. ఆ రోజు ఉదయం 10.20 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి విశాఖలో బస చేస్తారు. 24న సాయంత్రం 4.35 గంటలకు విశాఖ నుంచి విజయవాడ బయలుదేరుతారు.

కన్వీనర్లు, గృహసారథుల పాత్ర కీలకం

- సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడిచిన నాలుగున్నరేళ్లలో ఏ విధమైన మేలు జరిగిందో ప్రతీ కుటుంబానికి వివరించాలని.. ఇందులో గృహసారథుల పాత్ర కీలకమని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో 26, 42, 43, 44 వార్డులకు సంబంధించి గురువారం జరిగిన జేసీఎస్ మండలం–2 సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ ముందు చూపుతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా.. పచ్చ మీడియాను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రతీ గృహసారథి తన పరిధిలోని కుటుంబాలకు ఏ విధమైన మేలు జరిగింది.. ఏయే పథకాల ద్వారా లబ్ధి పొందారు.. తదితర వివరాలను సంబంధిత కార్పొరేటర్ నుంచి తీసుకోవాలని సూచించారు. విశాఖ నగర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పాలన కొనసాగించడానికి వస్తున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకాలన్నారు. చంద్రబాబు తన హయాంలో ప్రతి పథకం ద్వారా కోట్లాది రూపాయల రాష్ట్ర ఖజానాను దోచేశారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంలో రూ.371 కోట్ల అవినీతి జరిగినట్లు నిర్ధారణ కావడంతోనే సీఐడీ కేసు నమోదు చేసిందన్నారు. దీనిపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నాయని, వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అమరావతి భూసేకరణ, ఫైబర్‌నెట్‌లో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని.. వ్యవస్థలను మేనేజ్ చేసుకుని నాయకుడిగా చలామణి అవుతున్నారని దుయ్యబట్టారు. ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని.. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడం కోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు.

ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త తల ఎత్తుకుని తిరిగేలా మ్యానిఫెస్టోలో 98 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలు, ఆలోచనలను ప్రజల్లోకి తీసుకువెళ్లి.. మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. విశాఖ కేంద్రంగా విజయదశమి నుంచి పాలన కొనసాగిస్తామని సీఎం జగన్ ప్రకటించిన నేపథ్యంలో కేక్‌కట్ చేశారు. ఉత్తర నియోజకవర్గం తరఫున సుబ్బారెడ్డిని కె.కె.రాజు ఘనంగా సత్కరించారు.

జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారెడ్డి, నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ లజపతిరాయ్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, జోనల్ మహిళా విభాగం ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూఖీ, సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథ్, జిల్లా మహిళాధ్యక్షురాలు కృపా జ్యోతి, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, బర్కత్ ఆలీ, కె.వి.ఎన్. శశికళ, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, నాయకులు నీలి రవి, పైడి రమణ, కార్పొరేషన్ల డైరెక్టర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వైజాగ్ ఓపెన్ గోల్ఫ్



రెండో రౌండ్‌లో సత్తా చాటిన రాజేష్



గోల్ఫ్ ఆడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



రెండో రౌండ్‌లో సత్తాచాటిన అనురాగ్

విశాఖ స్పోర్ట్స్: వైజాగ్ ఓపెన్ గోల్ఫ్‌లో భాగంగా ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ కోర్స్(ఈపీజీసీ)లో రెండో రోజు గురువారం టీస్ ఆఫ్‌తో ఉత్సాహంగా సాగింది. భారత ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్(పీజీటీఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో రెండో రోజు 124 మంది గోల్ఫర్లు 42 మ్యాచ్‌లను కొనసాగించారు. మహమ్మద్ సంజు ఆధిక్యంతో రెండో రోజు టీస్ ఆఫ్ చేసేందుకు దిగగా.. మెరిట్ ఆర్డర్‌తో పోటీకి సిద్ధపడిన ఓం ప్రకాష్, హాట్ ఫేవరేట్‌గా హర్షజిత్ ఆధిక్యానికి శ్రమించారు. తొలిరోజు ఆటలో ఆధిక్యాన్ని ప్రదర్శించిన కోల్‌కతా గోల్ఫర్ సంజు రెండో రోజు 38వ మ్యాచ్‌లో టీస్ ఆఫ్ చేశాడు. సంజు తక్కువ(66) హిట్టింగ్ స్కోర్‌తో ఆధిక్యంలో భాగంగా 12వ హోల్ వద్ద 16 అడుగుల దూరాన్ని ఒకే సారి హిట్‌తో ఈగెల్ సాధించాడు. సాండ్‌లోనూ, 10, 17వ హోల్స్ వద్ద 20 అడుగులు, 12 అడుగుల దూరాన్ని హిట్ చేస్తూ బర్డీలు చేయడంతో ఒక్కసారిగా ఆధిక్యాన్ని అందుకున్నాడు. ప్రొఫెషనల్ గోల్ఫ్‌లో ఆర్డర్ ఆఫ్ మెరిట్ లీడర్ ఓం ప్రకాష్ చౌహాన్, సమిత్ బిష్ణోయ్‌తో కలిసి 69 స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించాడు. హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన హర్షజీత్‌సింగ్ సేఠీ 73 స్కోర్‌తో రెండో రౌండ్‌కు సిద్ధమయ్యాడు. చండీగఢ్ త్రయం హరేంద్ర గుప్తా, అక్షయ్ శర్మ, రాజీవ్‌కుమార్ బతివాల్‌తో పాటు అహ్మదాబాద్‌కు చెందిన అన్సుల్ పటేల్ 67 స్కోర్‌తో పోటీ పడ్డారు. టీస్ ఆఫ్ నిర్దేశించిన సమయానికే ప్రారంభం కావాల్సి ఉండగా తొలి రోజు వర్షం, వెలుతురు సరిగా లేని కారణంలో ఆరుగురు గోల్ఫర్లు ఆటను కొనసాగించలేకపోయారు. దీంతో గురువారం నిర్ణీత సమయం కంటే 45 నిమిషాల ముందే వారు ఆటను ప్రారంభించారు. వీరిలో ఢిల్లీకి చెందిన స్టార్ చిబ్బర్ అప్పటికే పూర్తి చేసిన 15 హోల్స్ ద్వారా ఫోర్ అండర్ స్కోర్‌తో రాణిస్తూ రెండో రోజు ఆటను కొనసాగించాడు. వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ పోటీలను టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆసక్తిగా తిలకించారు. పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆయన వెంట ఉన్నారు.

నాలుగు బర్డీలు.. ఒక డేగ



తొలిసారి ఈపీజీసీలో ఆడుతున్నాను. చాలా ఆనందంగా ఉంది. నా డ్రైవర్, ఐరన్స్‌తో చక్కటి హిట్స్ చేస్తూ తక్కువ షాట్స్‌లోనే పూర్తి చేశాను. కేవలం నాలుగు గ్రీన్స్ మాత్రమే కోల్పోయా. తొలి రోజు ప్రారంభ ప్రయోజనాన్ని పొందడానికి ఫీల్డ్ డేలో నాలుగు బర్డీలను, ఒక డేగను సాధించి తక్కువ హిట్స్‌తో 18 హోల్స్ పూర్తి చేశాను. రోజంతా వర్షం కురుస్తూనే ఉండటం కాస్త ఇబ్బంది కలిగినా.. నాలో ఆత్మవిశ్వాసంతో తొలిరోజు ఆధిక్యాన్ని ప్రదర్శించాను. గత ఏప్రిల్‌లో చండీగఢ్‌లో జరిగిన టోర్నీలో 10వ స్థానంలో నిలిచినా.. ఈ సారి కొత్త కోర్స్‌లో సరికొత్తగా ఆడటంతో మరింతగా రాణిస్తున్నా.

– సంజు, గోల్ఫర్

రెండు సార్లు విజేతనయ్యా..



తొలి రౌండ్‌కు భిన్నంగా రెండో రౌండ్ సాగింది. తొలి రోజు వర్షం కురవగా.. రెండో రోజు గాలులు వీచాయి. రెండు రౌండ్లలోనూ తొమ్మిది అండర్ పాయింట్లతో మూడు షాట్లు ఆధిక్యంలోకి రావడం ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పదో హోల్ దగ్గర చిప్ ఇన్ చేయడంతో బర్డీ సాధించాను. తర్వాత వరసగా 12, 13 హోల్స్ వద్ద రెండు బర్డీలు సాధించడంతో ఆధిక్యానికి చేరువయ్యాను. గరిష్ఠ సంఖ్యలో ఫెయిర్‌వే చేస్తే తర్వాత రెండు రౌండ్లలో మరింతగా రాణించేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే రెండు సార్లు పీజీటీఐ చాంప్‌గా నిలిచాను.

– అక్షయ్, పీజీటీఐ చాంపియన్

క్లుప్తంగా

ఐవోసీ టెర్మినల్ వద్ద స్వల్ప ప్రమాదం

పైపు పగలడంతో పెట్రోల్ వృథా

మల్కాపురం: ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌లో స్వల్ప ప్రమాదం చోటు చేసుకుంది. లోడింగ్ పాయింట్ వద్ద గురువారం ఓ లారీలో ఆయిల్ లోడ్ చేస్తున్న సమయంలో.. పాయింట్ నుంచి లారీ దగ్గరకు వెళ్లే పైపు పగిలిపోయింది. దీంతో సుమారు నాలుగు వేల లీటర్ల పెట్రోల్ నేల పాలయినట్లు సమాచారం. అయితే దీనిపై అధికారులు ఎటువంటి ప్రకటన చేయలేదు. నేల పాలైన పెట్రోల్ విలువ రూ.3 లక్షలపైనే ఉంటుందని అంచనా.

మహిళా న్యాయవాదుల సంబరాలు



మహిళ న్యాయవాదాల విజయోత్సాహం

విశాఖ లీగల్: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంతో విశాఖలో మహిళా న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోలి శ్రీనివాసరావు న్యాయవాదులందరికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల మహిళా సంఘం అధ్యక్షురాలు డి.మంజులత, ఉపాధ్యక్షురాలు బి.ఎస్.లతా,జి.నాగశ్రీ,ఇస్తేరాణి,బిజెపి కౌన్సిల్ సభ్యులు కిషోర్ కుమార్,న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు,కార్యదర్శి పైలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హిందీ వేడుకల్లో తూర్పు నావికాదళం



ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న రియర్ అడ్మిరల్ సందీప్ ప్రధాన్

సింధియా: తూర్పు నావికాదళ కమాండ్ వచ్చే నెల 5వ తేదీ వరకు హిందీ పక్షం వేడుకలను జరుపుకుంటోంది. ఈ వేడుకలకు చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ సందీప్ ప్రధాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా హెడ్ క్వార్టర్స్ నుంచి స్వర్ణజ్యోతి వద్ద వివిధ నౌకలు నుంచి సర్వీస్ సిబ్బంది హాజరయ్యారు. అక్టోబర్ 5న ఇన్‌హౌస్ హిందీ మ్యాగజైన్ పూర్వీ వాణి, 29వ ఎడిషన్‌ను విడుదల చేయడంతో పాటు వివిధ హిందీ పోటీలు, వర్క్ షాప్‌లను ఈ పక్షం రోజులు నిర్వహిస్తారు.

వేగవంతంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు

- ఆప్షన్-2 ద్వారా సొంత నిర్మాణాలకు బ్యాంకులు రుణాలు అందించాలి
- అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

దొండపర్తి: జిల్లాలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం వీఎంఆర్‌డీఏ కార్యాలయం నుంచి హౌసింగ్, వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలపై వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో సకాలంలో ఇళ్ల నిర్మాణాలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పని ప్రారంభించిన ప్రతి ఇంటికి బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల దశలను అప్‌డేట్ చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సి మెంట్‌లను లేఅవుట్లకు సక్రమంగా సరఫరా చేసేలా చూడాలని, సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్త య్యే లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు కరెంట్ అందించాలని, ఆ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలని ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్‌ను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు కాలనీల్లో మంచినీటి కుళాయి సౌకర్యం కల్పించాలన్నారు. కూలీల సమస్య లేకుండా చూడాలని హౌసింగ్ అధికారులకు చెప్పారు. సోక్ పిట్స్ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు . కాలనీ ముఖ ద్వారాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ము ఖ్యంగా ఆప్షన్-2 ద్వారా నిర్మించుకునే జగనన్న ఇళ్లకు పబ్లిక్ బ్యాంకులు విరివిగా పెద్ద ఎత్తున రుణా లు అందించి, పేదలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు కూడా బ్యాంకులకు నమ్మకం కలిగేలా అన్ని దస్త్రాలు అందించి వారితో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రధాన గెడ్డల్లో పూడికలు తొలగించండి



నేవల్ క్వార్టర్స్‌కు వరద ముంపు ఉందని కమిషనర్‌కు వివరిస్తున్న కమాండో ఆర్కే సింగ్

డాబాగార్డెన్స్: నగరంలోని ప్రధాన గెడ్డల్లో పూడికలు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గురువారం నేవల్ అధికారుల వినతి మేరకు మర్రిపాలెం, ఆకాశవానిపాలెంలోని నేవల్ ఆఫీస్, ఐఆర్‌ఎస్ కాలువ, కంచరపాలెం చాకలిగెడ్డ, ఎయిర్‌పోర్టు వద్ద కొండగెడ్డ కాలువలో పూడికలు తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్‌కు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రధాన కాలువల్లో ఉన్న వ్యర్థాల వల్ల నేవల్ క్వార్టర్స్‌కు వరద ముంపు ఉన్నందున నేవల్ అధికారుల విజ్ఞప్తి మేరకు 09 ఐఆర్‌ఎస్ డ్రైన్, చాకలిగెడ్డ, కొండగెడ్డ కాలువలోని పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ మెకానికల్ విభాగం అధికారులను ఆదేశించారు. ప్రధాన కాలువలో అధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, థర్మకోల్ షీట్స్ వస్తున్నాయని, వాటిని తొలగించే ప్రక్రియ వేగవంతం చేస్తామని నేవల్ అధికారులకు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో కమాండో ఆర్కే సింగ్, కెప్టెన్లు విశ్వజిద్ దత్త, పి.పృథ్వీరాజ్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, ఏసీపీ రామకృష్ణ, కార్యనిర్వాహక ఇంజినీరు తారా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

భారీ గణపతికి ప్రత్యేక పూజలు





వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ దంపతులకు జ్ఞాపికలు అందజేస్తున్న నీలాపు సర్వేశ్వరరెడ్డి, బృంద సభ్యులు

సీతమ్మధార: వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో దొండపర్తిలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన 108 అడుగుల భారీ గణనాథుడి విగ్రహాన్ని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి గురువారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, టీం సభ్యులు సుబ్బారెడ్డి, మేయర్‌ను ఘనంగా సత్కరించారు. పార్టీ నేత గొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవగాహన కల్పించిన మాక్ డ్రిల్



ఫోమ్ ద్వారా మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కాపురం: అందరూ విధుల్లో ఉండగా ఒక్కసారిగా సైరన్ మోగింది. ప్రమాద సూచిక అందడంతో ఉద్యోగులు పరుగులు తీశారు. హెచ్‌పీసీఎల్ ఎల్‌పిజీ టెర్మినల్ ఆవరణలో ఎల్‌పీజీ ట్యాంకర్‌కు నిప్పంటుకుంది. దీంతో ఉద్యోగ,కార్మికులు హడలిపోయారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. అయితే ఇదంతా మాక్‌డ్రిల్‌లో భాగమని తెలిసి అంతా ఊపిరి పీల్చుకున్నారు. మాక్ డ్రిల్ నిర్వాహణ అనంతరం జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి ఎస్.హెచ్.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థలో ప్రమాదాలు జరిగితే ఎలా నివారించాలి..ఎలా అప్రమత్తమవ్వాలో అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్టు చెప్పారు.

భార్యను హత్య చేసిన భర్త



జ్యోతిశ్రీ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత హత్యకు గురైంది. ఈ సంఘటనపై కృష్ణాజిల్లా చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంకు చెందిన వద్దాది జ్యోతిశ్రీ (31)కి కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని మలకాపట్నంకు చెందిన అవినాష్‌తో 2020లో వివాహం జరిగింది. వీరికి ఒక ఏడాది వయసు బాబు ఉన్నాడు. పనిపాట లేకుండా తిరిగే అవినాష్ జుట్టును ఏపుగా పెంచి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులోకి ఎక్కాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. రికార్డు యావలో పడ్డ అవినాష్ ఇంట్లో భార్యను బిడ్డను సరిగా పట్టించుకోవటం లేదు. దీంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం వారిద్దరి మధ్య మళ్లీ వివాదం జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన అవినాష్ ఆమె గొంతు నులిమి చంపేశాడు. జ్యోతిశ్రీ చనిపోయిన అనంతరం సమీప బంధువు వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పి తప్పించుకునేందుకు సహాయం చేయాలని కోరాడు. అందుకు అతడు నిరాకరించాడు. దీంతో చేసేది లేక అప్పటికే చనిపోయిన జ్యోతిశ్రీని బందరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి స్పృహ కోల్పోయినట్లు వైద్యులతో చెప్పాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే ఆసుపత్రికి చేరుకున్న జ్యోతిశ్రీ బంధువులు ఆమెది ముమ్మాటికీ హత్యేనంటూ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బందరు డీఎస్పీ మాధవరెడ్డి, టౌన్ సీఐ రవికుమార్ అవినాష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో జ్యోతిశ్రీని పీక నులిమి చంపినట్లు అవినాష్ ఒప్పుకోవటంతో హత్యగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

రౌడీషీటర్ హేమంత్ సాయి అరెస్ట్

సీతమ్మధార: పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ హేమంత్ సాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని.. ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రైల్వేస్టేషన్ పార్కింగ్ స్థలంలో గురువారం గంజాయితో మేడిశెట్టి హేమంత్ కుమార్ అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అటువైపుగా వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ అతన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. హేమంత్ నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ ఎస్.విజయకుమార్ అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

గోపాలపట్నం హైస్కూల్‌లో నేషనల్ సైన్స్ సెమినార్



గోపాలపట్నం హైస్కూల్‌లో చిరుధాన్యాలు గురించి వివరిస్తున్న హర్షవర్ధన్ నాయుడు

గోపాలపట్నం: మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ఆహార అలవాట్లు మార్చుకుని ఆరోగ్యంగా ఉండొచ్చని నేషల్ సైన్స్ సెమినార్‌లో విద్యార్థులు వివరించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ సెమినార్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లాలో సుమారు 30 పాఠశాలల నుంచి 60 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. చిరుధాన్యాలు, పోషకాహారం అన్న అంశంపై ప్రాజెక్టులు రూపొందించారు. భీమిలి డైట్ లెక్చరర్ గొట్టేటి రవి కుమార్, ఎల్‌బీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షర్మిల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలో గెలుపొందిన గోపాలపట్నం హైస్కూల్ విద్యార్థి పి.హర్షవర్దన్‌నాయుడు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్, ఎస్‌జీసీ కో ఆర్డినేటర్ ఎస్.బాబూరావు, రిసోర్స్ పర్సన్ సీహెచ్ గిరి ప్రసాద్, గోపాలపట్నం హైస్కూల్ హెచ్‌ఎం వైవీఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

గురజాడ పురస్కారాల ప్రదానం



గురజాడ పురస్కారాలను అందుకున్న కవులు, రచయితలతో నిర్వాహకులు

సీతంపేట: తెలుగు భాష అభివృద్ధి, వికాసం, పరిరక్షణలో భాగంగా త్వరలో ఉత్తరాంధ్ర స్థాయిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. తెలుగు భాష సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పౌర గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గురజాడ జయంతి సందర్భంగా ఇంత మంది కవులు, రచయితలను ఓ వేదికపై సత్కరించడం గొప్ప విషయమన్నారు. సాహిత్య వికాసం కోసం ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం బోర భారతీ దేవి రచించిన 'భారతీ శతకం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సేవా సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఆచార్య బాలమోహన్ దాస్, శృంగేరి శారద, అట్టాడ అప్పలనాయుడు, వెలమల సిమ్మన్న ప్రసంగించారు. అనంతరం 25 మంది ప్రముఖ కవులకు గురజాడ పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది.

గురజాడకు నివాళులు

దొండపర్తి: మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతి సందర్భంగా గురువారం గురజాడ కళాక్షేత్రంలో ఆయన విగ్రహానికి వీఎంఆర్‌డీఏ కార్యదర్శి రంగయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాషకు వన్నె తెచ్చిన మహాపురుషుడు గురజాడ అని, దురాచాలను రూపుమాపడం కోసం కవిత్వాన్ని బలమైన ఆయుధంగా నమ్మిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. సామాజిక అసమానతలపై గురజాడ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ డీఎఫ్ఓ శాంతి స్వరూప్, ప్లానింగ్, పరిపాలన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉద్యోగులకు పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు నియమాక పత్రాలను గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అందజేశారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ కేటాయించిన కార్యాలయాల్లో ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు మాట్లాడుతూ సిబ్బందికి పదోన్నతులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

ఆప్కాబ్ సమావేశానికి గురువులు హాజరు

అల్లిపురం: ఆప్కాబ్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా శ్రీశైలంలో గురువారం 13 జిల్లాల డీసీసీబీ చైర్మన్ల సమావేశం జరిగింది. ఆప్కాబ్ చైర్మన్ ఝాన్సీ రాణి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి విశాఖ జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోలా గురువులు హాజరయ్యారు. పలు అంశాలపై చర్చించారు.

25న పెందుర్తిలో ఉద్యోగ మేళా

ఎంవీపీకాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉపాధి కల్పన మిషన్ (సీడాప్), జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో 'బీమా జ్యువెలర్స్'లో సేల్స్ ట్రైనీ, కస్టమర్ రిలేషన్‌షిప్ ట్రైనీ ఉద్యోగాల భర్తీకి మేళా నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు పెందుర్తిలోని జిల్లా సమాఖ్య భవన్‌లో జరిగే ఇంటర్వ్యూకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 63030 00080, 63024 13301ను సంప్రదించవచ్చు.

• సాగరతీరంలో సుందర దృశ్యం



జోడుగుళ్లపాలెం బీచ్ వద్ద సూర్యోదయ సమయంలో సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

థాయ్‌లాండ్ పోర్టులో 'సముద్ర ప్రహరీ' విన్యాసాలు



బ్యాంకాక్‌లోని టోయి పోర్ట్‌లో గ్రూప్ ఫొటో దిగిన భారత, థాయ్‌లాండ్ అధికారులు

సింధియా: భారతదేశ సముద్ర నైపుణ్యం, నిబద్ధతను ప్రదర్శిస్తూ.. ఇండియన్ కోస్ట్ గార్డ్ కాలుష్య-నియంత్రణ నౌక 'సముద్ర ప్రహరీ' థాయ్‌లాండ్‌లోని ఖ్లాంగ్ టోయ్ పోర్ట్‌లో సమగ్ర కాలుష్య ప్రతిస్పందన టేబుల్-టాప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించింది. భాగస్వామ్య సవాళ్లను, ముఖ్యంగా సముద్ర కాలుష్యాన్ని పరిష్కరించడానికి ఈ వ్యాయామం జరిగింది. ఈ కార్యక్రమంలో థాయ్‌లాండ్‌కు చెందిన మారిటైమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కో-ఆర్డినేషన్ సెంటర్, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్, మెరైన్ డిపార్ట్‌మెంట్, రాయల్ నేవీ, మత్స్యశాఖ, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. అలాగే పునీత్ సాగర్ అభియాన్‌లో భాగంగా నౌక సిబ్బంది, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లు, భారత రాయబార కార్యాలయం ప్రతినిధులు పట్టాయా బీచ్‌లో అంతర్జాతీయ ఔట్రీచ్ బీచ్ క్లీన్-అప్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తగరపువలస: భీమిలి మండలం బోడమెట్టపాలెం జాతీయ రహదారిపై గోకులం ఆశ్రమం వద్ద గురువారం ఆర్టీసీ బస్సు వ్యాన్‌ను ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. విజయనగరం నుంచి తగరపువలస వైపు వస్తున్న వ్యాన్ వెనుక ఆర్టీసీ బస్సు వస్తోంది. ఆశ్రమం సమీపంలో కుక్కను తప్పించబోయి వ్యాన్ నెమ్మదించడంతో.. వెనుకనే వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేకులు వేసి వ్యాన్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న మన్యం పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన వారాడ శ్రీనివాసరావు నోటికి తీవ్ర గాయాలై దంతాలు ఊడిపోయాయి. ఇదే ప్రమాదంలో ఆయన భార్యతో పాటు ఎస్.కుమారి, గొలగాని నీలవేణి, మరికొందరు గాయపడ్డారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో వారం దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస-కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 28వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,050
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,050
వెండి(కిలో):	రూ.78,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం	: రూ.115
బ్రాయిలర్ (లైవ్)	: రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	535.00
విజయనగరం	539.00
శ్రీకాకుళం	539.00